క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం : ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రాదేశిక స్థానాలకు సంబంధించిన ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆమె తెలిపారు. అలాగే అన్ని శాఖలకు సంబంధించిన మండలస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం



విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, మండలంలోని లింగాయపల్లెకు చెందిన హేమలత అనే విద్యార్థినికి తేజశ్విని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ట్రస్ట్ అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి ఉపాధ్యాయుల చేతుల మీదుగా మంగళవారం ఆమెకు కళాశాల హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.12 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్ర, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

డయేరియా ప్రబల కుండా చర్యలు



ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

జమ్మలమడుగు : పట్టణంలో డయేరియా ప్రబలకుండా చర్యలను చేపట్టినట్లు శానిటేషన్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్‌తోపాటు దోమల నియంత్రణ కోసం ఫాగింగ్, కాలువ పూడిక తీత పనులను చేపట్టి ఎక్కడా నీరు నిల్వ లేకుండా చర్యలను చేపట్టినట్లు వివరించారు. కాలువల్లో నీరు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో నీటిని ట్రాక్టర్ ఇంజన్‌ల ద్వారా పంపింగ్ చేశామన్నారు. ప్రజలు ఇళ్ల వద్ద శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

డయేరియాపై సమీక్ష

సింహాద్రిపురం : కలెక్టర్ ఆదేశాల మేరకు డయేరియాపై మంగళవారం ఎంపీడీవో సాల్మాన్ రాజ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య, పైపుల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. అలాగే ఓవర్ ట్యాంకులను శుభ్రపరచాలని, డ్రైనేజీ కలుషితం కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాలలో డయేరియా కేసులు ఒక్కటి కూడా నమోదు కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భానుకోట క్షేత్రాన్ని దర్శించుకున్న ఐఏఎస్ అధికారి

సింహాద్రిపురం : మండలంలోని భానుకోట క్షేత్రాన్ని మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ ఖేలో ఇండియా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఐఏఎస్ హిమబిందు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు బద్రిశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆమెను ఆలయ అర్చకులు సన్మానించారు.

రాకపోకలకు ఇబ్బందులు



రామిరెడ్డిపల్లె రహదారి బ్రిడ్జి కింద ఉన్న నీరు

జమ్మలమడుగు : పట్టణం నుంచి వివిధ గ్రామాలకు ఆటోలలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపసుపుల రహదారిలో ఉన్న రైల్వే బ్రిడ్జి, రామిరెడ్డిపల్లెకు వెళ్లే రైల్వే బ్రిడ్జి కింద ఇటీవల కురిసిన వర్షాలకు నీరువచ్చి చేరుతోంది. దీంతో ఆటోలు బ్రిడ్జి కింద నీటిలో పోలేక అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జి కింద ఉన్న నీటిని తొలగించాలని రైల్వే అధికారులను ప్రజలు కోరుతున్నారు.

2 నుంచి మండల పూజ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో జూలై 2 నుంచి సుబ్రహ్మణ్యస్వామికి మండల పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకల్యాణార్థం గణపతి, సుబ్రహ్మణ్య, ధన్వంతరి హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

కల్యాణ వైభోగమే!



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



భక్తులకు మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును నిర్వహించిన అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహింపజేసి వారితో పాటు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇటీవలే మూడు రోజులపాటు ఆలయ చరిత్రలో తొలిసారిగా సహస్ర కలశాభిషేకాలు నిర్వహించారు. ఆ రోజు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు రాలేకపోయిన వారు కల్యాణం రోజున దర్శించుకోవడం పుణ్యదాయకమని భావించి విశేష సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం : ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అధికారులు శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మార్పూరి మేరీ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అన్ని శాఖల అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పూర్తిగా విని వాటిని పరిష్కరించేందకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పట్టణంలో చాలా చోట్ల డ్రైన్స్ నుంచి మురికినీరు బయటకు వస్తున్నాయని వాటిని తక్షణం అరి కట్టాలన్నారు. అలాగే మంచి నీటి పైప్‌లైన్లు డ్రైన్స్ కలసి ఉన్న చోట నీరు కలుషితం అయితే రోగాలు వస్తాయని దీంతో ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. లీకేజీలను అరికట్టడంతో పాటు ఎక్కడే గాని తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

సింహాద్రిపురం : మండలంలోని మండల విద్యా శాఖాధికారి వారి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈఓ శారద తెలిపారు. నిజాం ఫిజియోథెరపీ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సంతోష్ కుమార్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్స్ వాడకుండా ఫిజియోథెరపీ ద్వారా నొప్పి తగ్గించుకునే విధానం, మొబైల్ ఫోన్లు ద్వారా వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ గురించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. వ్యాయామం ద్వారా నొప్పులను ఎలా తగ్గించుకోవచ్చో తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అరవింద్, భవిత సెంటర్ ఉపాధ్యాయులు, మండల ఫిజియోథెరపిస్ట్ పి.సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం

వేంపల్లి : ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాదు అన్నారు. మంగళవారం ఎమర్జెన్సీ సమయంలో జైలుకెళ్లిన జనసంఘ్ నాయకుడు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డిని బీజేపీ, జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమర్జెన్సీ విధించి నేటికి 49 ఎళ్లు గడిచాయన్నారు. భావ ప్రకటనకు, స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ పౌరుల కనీస హక్కులను కాలరాస్తూ నాటి ప్రధాని ఇందిరా గాంధీ 1975వ ఏడాది జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమర్జెన్సీ 21 నెలలు పాటు కొనసాగిందన్నారు.

ఈ సమయంలో ప్రజాస్వామ్య వాదులెందరినో నాటి ప్రభుత్వం జైల్లో పెట్టిందన్నారు. ప్రజల ప్రాథమిక స్వేచ్ఛను కబళించి వారి మానవ హక్కులను తుంగలో తొక్కి ప్రసార మాధ్యమాలు గొంతు నొక్కడంతో పాటు రాజకీయ ప్రత్యర్థులను పాత్రికేయులను జైల్లో పెట్టడం జరిగిందన్నారు.

'నీట్'పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

ప్రొద్దుటూరు : నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. మంగళవారం నీట్ ఫలితాలపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై దేశమంతా స్పందిస్తుంటే టీడీపీ, జనసేన పార్టీల నాయకులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై అనేక అనుమానాలు, అభ్యంతరాలు ఉన్నాయన్నారు. ఇది దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశమని, పూర్తి స్థాయిలో విచారణ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దు చేసి అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే క్షేత్ర స్థాయిలో జరగాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు

పులివెందుల రూరల్ : పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ సర్వజన ఆసుపత్రిలో సామాజిక వైద్య శాస్త్ర విభాగంలో నెల రోజులుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై శిక్షణ ఇస్తున్న కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ అనంతరం ప్రజల్లోకి వెళ్లి క్యాన్సర్‌పై క్షేత్రస్థాయిలో సర్వే జరపాలన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లుపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో, వార్డులలో ప్రజలు ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్య కళాశాల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, ప్రొఫెసర్ నరేష్, నోడల్ ఆఫీసర్ కేశవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని హోమియో వైద్యుడు టి.మునిరాంప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాలు, గుడ్లు, ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కుర్‌కురే, పానిపూరి తదితర వాటిని తినకూడదని సూచించారు. పాఠశాలలోని 240 మంది విద్యార్థులకు డయేరియా రాకుండా ముందస్తుగా నివారణా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జె.సురేష్‌బాబు, కాంపౌండర్ నాగేశ్వరి, ఆశావర్కర్ రాణి, ఎంఎస్‌ఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలి



ఉర్దూ పాఠశాల ఆవరణలో నిరసన తెలియజేస్తున్న ఆవాజ్ నాయకులు, విద్యార్థులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మహబూబ్‌నగర్ వీధిలోని ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల లేని కారణంగా ఎంతో మంది ఉర్దూ మీడియం పది పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం కడప, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. గతంలో అనేక దఫాలు సమస్యను విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఏ మాత్రం ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని, లేనిపక్షంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ.సత్తార్, పట్టణ నాయకులు మస్తాన్, రసూల్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.మహబూబ్‌బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం చెల్లించాలంటూ వినతి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ఎంపీడీఓ వరప్రసాదరావుకు మంగళవారం వలంటీర్లు వినతిపత్రం అందచేశారు. గత నెలలో అన్ని చోట్లా గౌరవ వేతనం ఇచ్చారని, పోరుమామిళ్లలోని నాలుగు సచివాలయాల్లో మాత్రం వేతనం ఇవ్వలేదని వారు ఎంపీడీఓ దృష్టి తెచ్చారు. తాము రాజీనామా చేయలేదని, అయినా గౌరవ వేతనం నిలుపుదల చేయడం సబబు కాదన్నారు. తమకు వేతనం చెల్లించేలా చొరవ చూపాలని వలంటీర్లు ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ వలంటీర్లకు న్యాయం చేస్తామన్నారు.



ప్రత్యేక అలంకరణలో రతనాల వెంకటేశ్వరస్వామి

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన



ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున రతనాల వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, పూజలు చేసి అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేసి విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భూసార పరీక్ష.. నేలకు శ్రీరామ రక్ష



మట్టి నమూనాలు పరిశీలిస్తున్న వ్యవసాయ సంచాలకులు

లింగాల : లింగాల గ్రామంలో భూసార పరీక్ష నిమిత్తం సేకరిస్తున్న మట్టి నమూనాలను పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి మండల వ్యవసాయ అధికారి రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరానికి సంబంధించి లింగాల మండలానికి 630 నమూనాలను లక్ష్యంగా నిర్దేశించారన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది మటి నమూనాలను రైతుల పొలాలనుంచి సేకరించాలన్నారు. అలాగే సమస్యాత్మక నేలలను గుర్తించి వాటిపై శ్రద్ధ వహించాలన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని బొగ్గుడుపల్లె, బసిరెడ్డిపల్లె గ్రామాలలో రైతులు సాగుచేసిన పత్తి పంటలను వ్యవసాయ పరిశోధన కేంద్రం ఊటుకూరు కడపకు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు పరిశీలించారు. పత్తిపంట 70 రోజుల పంటగా గుర్తించామన్నారు. పత్తి పంటలో పచ్చదోమ ఉధృతిని గుర్తించామని వాటి నివారణకు పొటాషియం నైట్రేట్ 10 గ్రాముల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ప్రతిరైతు పంట వేసిన 15 రోజులకు మోనోక్రోపోన్స్ 1.6మిల్లీ లీటర్ నీటికి 19–19–1910 గ్రాములకు 1 లీటరకు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. ముఖ్యంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటిస్తే పత్తిలో మంచి లాభాలు సాదించవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నరసింహారెడ్డి, గంగాధర రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకులు, సునీల్‌కుమార్, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల ప్రాంత అభివృద్ధే టీడీపీ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతాన్ని అన్ని విధాల అభివద్ధి చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు తాము రుణపడి ఉంటామన్నారు. పులివెందుల ప్రాంత ప్రజలపై ఎలాంటి కోపం లేదన్నారు. కొంత మంది అధికారులు టీడీపీ ప్రభుత్వానికి విధేయలమని చెప్పుకుంటూ మళ్లీ జిల్లాలోనే పోస్టింగుల కోసం ఎగబడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల దీపాలు వెలిగించారు. తెల్లవారుజామున పంచామృతాభిషేకం, షోడశోపచార పూజలు నిర్వహించారు. సాయంత్రం 3 గంటల అనంతరం ఆలయ ఆవరణలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నవగ్రహాలకు పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ బడిని రక్షించుకుందాం .. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించండి అనే నినాదంతో యూటీఎఫ్ కడప జిల్లా శాఖ కరపత్రాలను ముద్రించింది. మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధ చేతుల మీదుగా కరప్రతాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నైతిక విలువలు, చదువు, సంస్కారం దేశభక్తి, సమానత్వ భావనలతో విద్యాబుద్ధులు బోధిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు బడి బయట ఉన్న పిల్లలను బడిలే చేర్పించడం, ప్రభుత్వ బడిలోని సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియచేసి వారి పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పాటుపడుతోందని డీఈఓ మర్రెడ్డి అనురాధ కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు పివి రమణ, అడహాక్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కృష్ణారెడ్డి, గోపీనాథ్, చంద్రశేఖర్, కేదార్నాద్, కరీముల్లా, సమీర్‌బాషా, శివకుమార్‌రాజు, వెంకటసుబ్బయ్య, సురేష్‌కుమార్, సుబ్బారెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేములమ్మా.. వర్షం కురిపించవమ్మా

మండల పరిధిలోని వేములూరు గ్రామానికి చెందిన మహిళలు వేములమ్మా వర్షం కురిపించమంటూ వేములమ్మకు బోనాలు సమర్పించారు. ఈ ఏడాది జూన్ మాసం దాటుతున్నా పదును వర్షాలు లేకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో వేములూరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ సమీపంలో వెలసిన వేములమ్మకు పార్టీలు, కులమతాలకు అతీతంగా వర్షాలు కురిపించాలని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– అట్లూరు



వేములమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు